పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: ఎమ్మెల్యే



తన నివాసంలో కుండీల్లో నీటిని తొలగిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ఇళ్ల చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రై డే - డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఆయన తన నివాసంలోని కుండీల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఈ సందర్భంగా అక్కడ పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడంతో పాటు దోమల నివారణ మందులు పిచికారి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఉపకమిషనర్ కృష్ణయ్య, వైద్యాధికారి మమత, మోహన్‌రెడ్డి, ఎంటమాలజీ విభాగం ఏఈ ఉష తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని సాయినగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్‌కు అత్యవసర వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా విడుదలైన రూ.1.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శుక్రవారం సప్తగిరికాలనీలోని తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. శ్రీనివాస్‌యాదవ్, సంజీవరెడ్డి, పోతుల రాజేందర్, కాశీనాథ్‌యాదవ్, భాస్కర్, ధనలక్ష్మి పాల్గొన్నారు.



జోనల్‌కమిషనర్ అపూర్వ్‌చౌహాన్‌కు సమస్యలు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలి

కూకట్‌పల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీల్లోని రోడ్లు, డ్రైనేజీ, ట్రాఫిక్, వీధిదీపాలు, నీటి నిల్వ ప్రాంతాలు, దోమల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి వెంటనే చర్యలు తీసుకొంటానని జెడ్సీ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, నాయకులు శేరి సతీష్‌రెడ్డి, తూము వేణు, వెంకటేశ్వరరావు, లక్ష్మణ్, రాఘవేంద్రరావు, ప్రవీణ్‌కుమార్, కృష్ణరాజ్‌పుత్, సతీష్‌గౌడ్, మేకల రమేష్, సునీల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

- మూసాపేటలోని రెయిన్‌బో విస్టా గేటెడ్ కమ్యూనిటీ పరిసరాల్లో నెలకొన్న దోమల సమస్యకు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దంత పరీక్షలు



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

షాపూర్‌నగర్,జూలై 12(ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం అబ్దుల్ కలాం శాఖ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ స్కూల్లోని పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్ష శుక్రవారం నిర్వహించారు. సుమారు 150 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఈపరీక్షలు క్లోవ్ డెంటల్ ఆసుపత్రి డాక్టర్ భరద్వాజ, అసిస్టెంట్ డాక్టర్ సుధాకర్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ అబ్దుల్ కలాం శాఖ కార్యదర్శి కోలా రవీందర్ ముదిరాజ్ విద్యార్థులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కమల్‌సింగ్, స్థానిక నాయకులు రాములు ముదిరాజ్‌లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

డెంగీపై విద్యార్థులకు అవగాహన

గచ్చిబౌలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ అధికారులు డెంగీపై విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజలకు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. జవహర్‌నవోదయ పాఠశాల విద్యార్థులకు డెంగీతో ఏవిధమైన పరిణామాలు ఉంటాయో తెలిపారు. ఉపకమిషనర్ రజనికాంత్‌రెడ్డి, సిబ్బంది ఫ్రై డే డ్రై డే అంటూ నినాదాలు చేస్తూ దోమల నివారణపై యుద్ధం చేసే విధంగా నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

దోమల వల్ల వచ్చే వ్యాధులపై..



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, అధికారులు

హైదర్‌నగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషిగూడ ప్రభుత్వ పాఠశాలలో దోమల నివారణలో భాగంగా జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది దోమకాటు వల్లే కలిగే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి ఆవరణలో ఎక్కువ రోజు నీరు నిల్వ ఉన్నచోట ఈ నీటిని పారబోయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు నరసింహులు, సుందరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల్లో నీరు నిల్వ ఉండొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అబ్దుల్ రజాక్

పేట్ బషీరాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఉండే పరిసరాలు, ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఎంటమాలజీ సూపర్‌వైజర్ అబ్దుల్ రజాక్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డినగర్ డివిజన్‌లోని నందానగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో దోమల నివారణ, వాటి ద్వారా వ్యాపించే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోధకాలువ్యాధి, సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో నేర్చుకునే అంశాలను తమ ఇళ్లల్లో కూడా అనుసరించాలని తెలిపారు.

కొనసాగుతున్న వారాహి నవరాత్రులు



పుష్పాలంకరణలో వారాహిస్వామి

చందానగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వారాహి నవరాత్రుల సందర్భాన్ని పురస్కరించుకుని డివిజన్ పరిధిలోని ఆలయాల్లో వారాహి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం పీజేఆర్ ఎన్‌క్లేవ్‌లోని ధర్మశాస్త్ర ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం 8 గంటల వరకు విశేష పూజలు నిర్వహించారు. కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. చందానగర్ వెంకటేశ్వరస్వామి వారాహి ఆలయంలో భక్తులు విశేషంగా పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలకు హోమాలు, పూజలు చేశారు.

కూకట్‌పల్లి కాంగ్రెస్ నేతలకు దక్కని నామినేటెడ్ పోస్టులు

పార్టీ శ్రేణుల్లో రగులుకుంటున్న అసంతృప్తి జ్వాలలు



అధికారంలోకి వచ్చాక అంతా తామే అంటున్న సీనియర్లు

బాలానగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తి జ్వాలలు రగులుకుంటున్నాయి. ఇంతకాలం కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ, పార్టీ గెలుపు కోసం అహర్నిషలు శ్రమించి పార్టీ అధికారంలోకి వస్తే తమకు ఏదో ఒక పదవి దక్కుతుందనే ఆశతో ఉన్న సీనియర్ నాయకుల అంచనాలు తారుమారవుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల అనంతరం నామినేటెడ్ పదవులను అధిష్ఠానం ప్రకటిస్తుందనీ, అందులో తమ పేరు ఎలాగైన ఉండవచ్చుననీ గంపెడాశతో ఉన్న కూకట్‌పల్లి సీనియర్ నేతలకు అధిష్ఠానం మొండిచెయ్యి చూపించింది. దీంతో సీనియర్ నాయకులంతా ఆవేదనకు గురవుతున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు సొంత డబ్బులు ఖర్చు చేసి పార్టీ, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ కార్యకర్తలను ఉత్తేజపరుస్తూ వారిని కాపాడుకుంటూ వచ్చిన సీనియర్లను అధిష్ఠానం గుర్తించకపోవడంతో వారంతా తీవ్ర మనో వేదనకు గురవుతున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో దశాబ్దాల కాలం నుంచి ఏ పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని అవమానాలు, బెదిరింపులను భరించిన నేతలకు ఒక్క నామినేటెడ్ పదవి దక్కకపోవడంతో సీనియర్ నాయకులంతా లోలోనే కుమిలిపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తనకు టికెట్ దక్కలేదని కొందరు సీనియర్ నాయకులు అలిగి పక్క పార్టీలోకి జంప్ అయితే తామంతా కార్యకర్తల్లో ధైర్యం నింపుతూ ఎన్నికలను ఎదుర్కొని పార్టీ విజయానికి కృషి చేశామన్నారు. అయినా తమకేమీ ప్రాధాన్యం లభించడం లేదని సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూకట్‌పల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు పట్లోళ్ల నాగిరెడ్డి, సత్యం శ్రీరంగం, దండుగుల యాదగిరి, గాలి బాలాజీ, సీనియర్ మహిళా నాయకులు కొండకింది పుష్పారెడ్డి లాంటి వారు ఉన్నప్పటికీ అధిష్ఠానం వారికి ఎలాంటి పదవులను ఇవ్వలేదు. స్థానిక సమస్యలపై తన గళాన్ని వినిపిస్తూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో జోనల్ కమిషనర్ మమత తీరుపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి అధిష్ఠానం గుర్తించకపోవడంపై పార్టీ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం కనిపిస్తోంది. రేవంత్‌రెడ్డి మొదటిసారిగా మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసిన సమయంలో పార్టీ జెండా మోసి ఆయన గెలుపు కోసం కృషి చేసిన కూకట్‌పల్లి నేతలను ఆయన ఎందుకు మర్చిపోయారోనని కొందరు సీనియర్లు గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధిష్ఠానం తమను గుర్తిస్తే చాలని సీనియర్ నేతలు చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు కొందరు సీనియర్లు పక్క పార్టీ కోసం పని చేసి.. కాంగ్రెస్ ఓడిపోక తప్పదని పందాలు వేశారని.. ఇప్పుడేమో అధికారంలోకి రాగానే పార్టీని ఆదుకున్నది తామే అంటూ పోజులు కొడుతున్నారని పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. నాడు స్తబ్దుగా ఉన్న వారంతా నేడు ముందుకొస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ కార్యకర్తనని చెప్పుకోవడానికి కూడా ఇష్టపడని వారు పార్టీకి అంతా మేమే, అన్నీ మేమే అనే రీతిలో హడావిడీ చేస్తుండడంతో మిగతా సీనియర్లకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. సదరు నేతలకు కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ వత్తాసు పలుకుతూ సీనియర్లను పట్టించుకోక పోవడంలో పార్టీకి చెందిన సీనియర్లు కొందరు ప్రేక్షక పాత్ర వహించాల్సిన పరిస్థితులు ఉన్నాయని వాపోతున్నారు.



పేకాట ఆడుతూ పట్టుబడ్డ వ్యక్తులు, నగదు

పేకాట స్థావరంపై దాడులు


జీడిమెట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి 8 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 4 లక్షల రూపాయల నగదు, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. చింతల్ ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన గిరిగాని సతీష్‌కుమార్(41) జీడిమెట్లలోని గాంధీనగర్‌లో పరిశ్రమ నిర్వహిస్తూ, పేకాట స్థావరాన్ని ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా వీరయ్య

గచ్చిబౌలి: అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఏఐసీసీ సభ్యులు, భద్రాది కొత్తగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వీరయ్య శుక్రవారం కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు ఆయనను అభినందించారు. అనంతరం బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటారు. సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ వీరయ్య కరుడుగట్టిన కాంగ్రెస్ వాదని, గొప్ప నాయకుడని కొనియాడారు. వీరయ్యకు కాంగ్రెస్‌లో మంచి భవిష్యత్ ఉందని, పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అనంతరం కార్పొరేషన్ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం అధికారులతో ఆయన భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయిబ్యాచ్ హల్‌చల్

- మత్తులో ఇద్దరిపై దాడి



ఆంజనేయులు



చంద్రమౌళి

జీడిమెట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గాజులరామారం రోడ్డులోని మార్కండేయనగర్‌లో గంజాయి బ్యాచ్ గురువారం రాత్రి రెచ్చిపోయింది. రాత్రి 11 గంటల సమయంలో గంజాయి మత్తులో ఇళ్ల వద్ద గొడవ చేస్తున్నారు. ఈ క్రమంలో స్థానికంగా ఉండే ఇద్దరు వ్యక్తులు గొడవ చేయవద్దని చెప్పినందుకు 11 మంది గంజాయి గ్యాంగ్ చంద్రమౌళి, ఆంజనేయులు అనే వ్యక్తులు విచక్షణారహితంగా దాడిచేసి చేశారు. ఈఘటనలో ఆంజనేయులు ఎడమ కంటికి తీవ్రగాయమైంది. దాదాపు గంటపాటు గంజాయి బ్యాచ్ చేసి హడావిడితో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. బాధితులు శుక్రవారం జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ మాట్లాడుతూ గంజాయి బ్యాచ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఇద్దరు కూలీల మధ్య ఘర్షణ - ఒకరి మృతి

మియాపూర్: ఇద్దరి కూలీలు మద్యం మత్తులో ఘర్షణ పడ్డారు. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేయంతో ఒకరి తలకు బలమైన గాయం కావడంతో చికిత్సనిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మియాపూర్ కల్వరిటెంపుల్ రోడ్డులో ఉండే మాన్‌సింగ్, అరవింద్‌సింగ్ కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో 10వ తేదీన అరవింద్‌సింగ్, మాన్‌సింగ్ గొడవ పడ్డారు. దీంతో మాన్‌సింగ్‌కు తలకు బలమైన గాయం కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నిందితుడు అరవింద్‌సింగ్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

20 నుంచి హైటెక్స్‌లో చేనేత, హస్తకళల ప్రదర్శన

- వెల్లడించిన ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) సభ్యులు
- ఎంఎస్‌ఎంఈ ప్రోత్సాహం కోసం స్టైల్‌తత్వ



స్టైల్‌తత్వ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫ్లో సభ్యులు

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారిత, ఎంఎస్‌ఎంఈ రంగాల్లో వ్యాపారాలను నిర్వహిస్తున్న వారిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో), హైదరాబాద్ చాప్టర్ స్టైల్‌తత్వ పేరిట ఓ ప్రదర్శనను చేయబోతుంది. ఈనెల 20 నుంచి రెండు రోజుల పాటు హైటెక్స్ ప్రాంగణంలో జరిగే ఈ ప్రదర్శన గురించి సోమాజిగూడలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఫ్యాషన్ డిజైనర్ నమ్రత జోషిపురా పాల్గొన్న ఈ సమావేశంలో ఫ్లో హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ ప్రియాగజ్దార్ సహా పలువురు ఫ్లో సభ్యులు, మెంటార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రియాగజ్దార్ మాట్లాడుతూ.. 'స్టైల్‌తత్వ నాల్గవ ఎడిషన్‌ను ఈనెల 20, 21 తేదీలలో హైటెక్స్‌లో నిర్వహించబోతున్నామని, మహిళా సాధికారిత లక్ష్యంగా, ఎంఎస్‌ఎంఈలకు తోడ్పాటు అందించడంలో భాగంగా ఈ ప్రదర్శన చేయబోతున్నామని' తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా వచ్చిన డబ్బుని సామాజిక ప్రభావ కార్యక్రమాల కోసం వినియోగిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా 100 మంది రైతులకు ఆధునిక వ్యవసాయంలో శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా ఐదు వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ కోసం ఓ పెవిలియన్ ఏర్పాటు చేయడంతో పాటుగా సంప్రదాయం, ఆధునికతల నడుమ అంతరాన్ని పూరించనున్నామని ఫ్లో స్టైల్ తత్వ మెంటార్ మంజుల రెడ్డి అన్నారు. మరో మెంటార్ రేఖా లహోటీ మాట్లాడుతూ.. దాదాపు 15 రాష్ట్రాల నుంచి 200 మంది ఎంఎస్‌ఎంఈలు ఈ ప్రదర్శనలో పాల్గొంటాయని తెలిపారు.



పాదచారులను రోడ్డు దాటిస్తున్న ట్రాఫిక్ మార్షల్స్

ప్రయోగాత్మకంగా ట్రాఫిక్ మార్షల్స్ సేవలు

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ సిబ్బందికి, ప్రజలకు సహకరించేందుకు సైబరాబాద్ పోలీసులు ట్రాఫిక్ మార్షల్స్‌ను ప్రయోగాత్మకంగా రంగంలోకి దించారు. సీపీ అవినాష్ మహంతి ఆధ్వర్యంలో సైబరాబాద్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) సహకారంతో శిక్షణ పొందిన ట్రాఫిక్ మార్షల్స్‌ను విధుల్లోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విధుల్లో చేరిన ట్రాఫిక్ మార్షల్స్ క్రమశిక్షణ, బాధ్యతతో పనిచేసి పోలీస్‌శాఖకు వన్నె తీసుకురావాలని సూచించారు. జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ మార్షల్స్ ట్రాఫిక్ నియంత్రణలో పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీఎస్సీ ప్రతినిధులు రమేష్ ఖాజా, రాజేష్ రహేజా మైండ్ స్పేస్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీలు శివకుమార్, వీరన్న, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

ఈఎస్‌సీఐకి ఐఓఎస్ సర్టిఫికెట్లు

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ)కు గ్రీన్ అవార్డుతో పాటు నాలుగు ఐఓఎస్ సర్టిఫికెట్లు వచ్చాయి. శుక్రవారం కళాశాల బోర్డు రూమ్‌లో హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ లిమిటెడ్ మెనేజింగ్ డైరెక్టర్ శివరాం ఆలపాటి ఐఓఎస్ సర్టిఫికెట్లను ఈఎస్‌సీఐ చైర్మన్ రామేశ్వర్‌రావుకు అందజేశారు. పరిపాలనా వ్యవహారాలు, డాక్యుమెంటేషన్ విధానాలు, ఉద్యోగుల సమయపాలన, విధి నిర్వహణ, ఫైళ్ల సత్వర పరిష్కారం, కళాశాల ప్రాంగణంలోని బండరాళ్లు, యేళ్ల కాలం నాటి వృక్షాలు, అటవీ సంపదను కాపాడడం తదితర అంశాల్లో ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు ఇచ్చిందని రామేశ్వర్‌రావు తెలిపారు.



ఎన్‌సీసీ కెడెట్స్‌తో గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్

కేడెట్స్‌ను సత్కరించిన ఎన్‌సీసీ గ్రూప్ హైదరాబాద్

అల్వాల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన థాల్ సైనిక్ క్యాంప్ ఇంటర్ గ్రూప్ పోటీలో విజయం సాధించిన 51 మంది కేడెట్స్‌ను శుక్రవారం ఎన్‌సీసీ గ్రూప్ హైదరాబాద్ సత్కరించింది. జూలై 1 నుంచి 10 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌లో ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏపీ, తెలంగాణకు చెందిన మొత్తం 9 గ్రూప్ టీమ్‌లు పాల్గొన్నాయి. హైదరాబాద్ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్ నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేడెట్స్ క్రమశిక్షణతో పాటు అసాధారణమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారని ఆయన కొనియాడారు. పట్టుదలతో విజయాన్ని సాధించడంలో కేడెట్స్ జట్టు కోసం చేసిన కృషిని కల్నల్ అనిల్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన కేడెట్స్‌కు బహుమతులను ప్రదానం చేశారు. గోల్డ్‌మెడల్స్ సాధించిన లాన్స్ కార్పోరల్ అభిషేక్, కేడెట్స్ మేఘన, అర్పిత్ యాదవ్, సాయికుమార్‌లను, కాంస్యపతకాలు సాధించిన కార్పోరల్ తనుష్క, కెడెట్ సయ్యద్ వాసిఫ్‌లను కల్నల్ అనిల్ ప్రత్యేకంగా అభినందించారు.

యువకుడి అవయవదానం

ఆరుగురి జీవితాల్లో వెలుగులు



ప్రవీణ్ (ఫైల్)

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తాను చనిపోతూ దానం చేసిన అవయవాలతో ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు కామారెడ్డికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి మెట్టు ప్రవీణ్(27). మంగళవారం తన బైక్‌ను పార్క్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు గాయం కావడంతో వెంటనే అతడిని కొంపెల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన చికిత్స కోసం సూరారంలోని మరో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. నాలుగు రోజులు గడిచినప్పటికీ ఆరోగ్య పరిస్థితిలో మెరుగుదల కనిపించలేదు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ సభ్యులు బాధితుడి కుటుంబసభ్యులతో అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో అతడి నుంచి కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కార్నియాలను సేకరించారు. అవసరమైన ఆరుగురు బాధితులకు వాటిని అమర్చారు.

'భూ' మాయ!

- రూ.300 కోట్ల విలువైన భూమికి రెక్కలు
- నిషేధిత జాబితాలో ఉన్నా.. పాస్‌పుస్తకాలు జారీ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

నగర శివార్లలోని దాదాపు రూ.300 కోట్లకు పైగా విలువ చేసే 33.08 ఎకరాల పోరంబోకు భూములకు రెక్కలు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న ఈ విలువైన భూములకు కొత్త పాస్‌బుక్‌లు జారీ చేసిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఫిర్యాదు రావడంతో భూమిపై జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. మహేశ్వరం మండలం మంఖాల్‌లోని 608, 609, 610 సర్వే నంబర్లలో 33.08 ఎకరాల భూమిని 22ఏ కింద గతంలో నిషేధిత జాబితాలో పెట్టారు. 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో ఈ భూమి పోరంబోకు/గైరానా సర్కారీగా నమోదైంది. ఈ భూముల క్రయవిక్రయాలు జరగకుండా 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం వెబ్‌సైట్‌లో కూడా ఇప్పటికీ ఈ భూమి నిషేధిత జాబితాలోనే ఉంది. అయితే, గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు ఈ భూములకు రెక్కలు వచ్చాయి. ఈ భూమి మొత్తం పట్టా భూమిగా మారిపోయింది. దీనికి సంబంధించిన ఫైళ్లన్నీ సచివాలయం వరకు కదిలాయి. కొందరి పేరు మీద పాస్‌బుక్‌లు కూడా ఆగమేఘాలపై జారీ చేశారు. కొందరు రాజకీయ నేతలు, రియల్ ఎస్టేట్ సంస్థల పేర్ల మీదకు ఈ భూమి మారింది. ప్రభుత్వం మారడంతో దీనిపై స్థానికులు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. కొందరు బడా రాజకీయ నేతలు, రియల్ వ్యాపారులు కలిసి ఈ భూములు కొల్లగొట్టారని దీనిపై విచారణ జరపాలని ఆయన ప్రభుత్వానికి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. భూ వివాదాలకు సంబంధించి జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న రెండు టాస్క్‌బృందాల్లో ఒక బృందానికి విచారణ బాధ్యతలు అప్పగించారు. భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు నేతృత్వంలోని రెవెన్యూ అధికారులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు. ఇదిలా ఉంటే ఇదే సమయంలో స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మి సెలవులో వెళ్లడంతో తాత్కాలికంగా కలెక్టరేట్‌లో పని చేస్తున్న రాజశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మొత్తం ఈ వ్యవహారంపై డిప్యూటీ కలెక్టర్ రాజు, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖర్ విచారణ జరుపుతున్నారు. మొత్తం ఈ భూమి వ్యవహారంపై రెండు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

1975 నుంచి రికార్డులు గల్లంతు

మంఖాల్‌లోని ఈ భూములకు సంబంధించిన రికార్డులు కొన్ని గల్లంతైనట్లు అధికారుల విచారణలో తేలింది. అయితే తొలుత ఈ భూమి సేత్వారీలో పట్టాగా ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. తరువాత కొన్నాళ్ల ప్రభుత్వ రికార్డుల్లో అలానే కొనసాగినప్పటికీ 1975నుంచి ఈ సర్వే నంబర్‌కు సంబంధించిన రికార్డులు గల్లంతయ్యాయి. అనుభవదారుల కాలమ్‌లో కొందరు వ్యక్తుల పేర్లు కొనసాగాయి. అయితే, 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో పోరంబోకు/సర్కారీ గైరానా అని నమోదవుతూ వస్తోంది. చివరకు 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. దీంతో ఈ భూముల జోలికి ఎవరూ వెళ్లలేదు. కానీ, కొందరు పేర్లు మాత్రం అనుభవదారుల కాలమ్‌లో రాశారు. సేత్వారీలో గతంలో పట్టాగా నమోదైందని చెబుతూ దీని ఆధారంగానే మిగతా వ్యవహారమంతా నడిపి ఫైల్ క్లియర్ చేసుకున్నట్లు తెలిసింది.

నిజాంపేట్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతా

నిజాంపేట్, జూలై 12(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ సమావేశ మందిరంలో మేయర్ కొలన్ నీలారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌ల్లో పెడింగ్‌లో ఉన్న పనులను త్వరత గతిన పూర్తి చెయ్యాలన్నారు. నైతిక పనులకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కుత్బుల్లా పూర్ నియోజకవర్గ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పించి, ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ధన్ రాజ్‌యాదవ్, కమిషనర్ రామకృష్ణారావు, తహసీల్దార్ పూల్‌సింగ్, ఉన్నారు.

- **నైపుణ్యతను పెంపొందించుకోవాలి**

దుండిగల్: నైపుణ్యతను పెంపొందించుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. బహదూర్‌పల్లిలోని కేంఎం పాండు గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అప్రెన్‌షిప్ మేళాకు ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ.. నేటి పోటీ సమాజంలో వృత్తి విద్యా కోర్సులకు ఎంతో ఆదరణ ఉందన్నారు.

- **కుత్బుల్లాపూర్:** హెచ్‌ఎంటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కేంద్రమంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మలకు ఎమ్మెల్యే వివేకానంద్ విన్నవించారు. హెచ్‌ఎంటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.